క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేపట్టారు.

బాల్య వివాహాల నియంత్రణే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు

సైదాపురం : బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నియంత్రించడమే తమ లక్ష్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మండలంలోని అనంతమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యకర్తలు పుల్లమ్మ, పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



అవగాహన ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, యువకులు

వాకాడు : మత్తు పదార్థాలను వినియోగిస్తే జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. వాకాడులో శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత మత్తు పదార్థాలను వినియోగించడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారని తెలిపారు. తద్వారా బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ గూడూరు సీఐ బాలక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు : ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు శనివారం వాకాడు మండలంలో దాడులు చేపట్టారు. ఆమిదాలపాటు గ్రామంలో బెల్టు దుకాణం నడుపుతున్న గోపిని అరెస్టు చేసి 10 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ ఆర్ యూవీఎస్ ప్రసాద్ కోరారు.

హెచ్‌ఎంకు ఘన వీడ్కోలు



హెచ్‌ఎంను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం పోటుపాళెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కళ్యాణి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమెకు శనివారం ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గూడూరు ఎంఈవో -2 కాంచన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కళ్యాణి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. శేష జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎస్ శంకరయ్య స్కూల్ కరస్పాండెంట్ పవన్, యూటీఎఫ్ నాయకులు సుధీర్, ఉపాధ్యాయులు విష్ణుప్రియ, పద్మ, శ్రీనివాసులు, కృష్ణమ్మ, నిర్మలమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ ఆలయంలో హుండీ చోరీ

వాకాడు : మండలంలోని రావిగుంటపాళెంలో వున్న పుట్టాలమ్మ ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు స్థానికులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం పూజల అనంతరం పూజారి తలుపులు వేసుకుని ఇంటికి వెళ్లాడన్నారు. దుండగులు ఆలయంలోకి చొరబడి హుండీని పగులగొట్టి అందులోని నగదును చోరీ చేశారని పేర్కొన్నారు. ఉగాది పండుగ నుంచి ఇప్పటి వరకు భక్తులు వేసిన కానుకలు సుమారు లక్ష వరకు ఉండవచ్చని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓజిలి: పున్నేపల్లి చప్టా వద్ద ప్రవహిస్తున్న వరద నీరు, దొరవారిసత్రం : తనియాలి సమీపంలో బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, దొరవారిసత్రం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో నిలిచిన నీరు, వెదురుపట్టులో చెరువును తలపిస్తున్న పొలాలు









ఎడతెరిపి లేని వర్షం

ఫెంగల్ తుపాను ప్రభావంతో సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కాలువలు, నదులు పొంగి ప్రవహిస్తున్నారు. చెరువుల్లోకి నీరు చేరింది. అధికారులు శనివారం పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. నదులు, బ్రిడ్జిల వద్ద రాకపోకలు సాగించకుండా భద్రత ఏర్పాటు చేశారు. దెబ్బతిన్న, ఇళ్లలోకి నీరు చేరిన వారిని పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలోకి తరలించారు.

– పెళ్లకూరు/ఓజిలి/దొరవారిసత్రం/సైదాపురం/రాపూరు/వెంకటగిరి రూరల్/చిల్లకూరు/కోట/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట రూరల్:



దొరవారిసత్రం : కుప్పారెడ్డిపాలెం ప్రాంతంలో బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న పాలకాలువ

- పెళ్లకూరు మండలంలోని చెంబేడు, పెళ్లకూరు, పునబాక, చిల్లకూరు, శిరసనంబేడు, అర్ధమాల, పాలచ్చూరు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వరినాట్లు నీట మునిగాయి. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. స్వర్ణముఖి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలను నిలిపేశారు. పాలచ్చూరు వద్ద మామిడి కాలువలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఎస్‌ఐ నాగరాజు ప్రజలను అప్రమత్తం చేశారు.
- ఓజిలి మండలంలోని కురుగొండ, ఓజిలి, మానమాల, చిలమానుచేను, బత్తలాపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. మానమాల, పున్నేపల్లి గ్రామాల వద్ద మామిడి కాలువ నీరు చప్టా అంచులకు ప్రవహిస్తోంది. తహసీల్దార్ పద్మావతి ప్రజలను అప్రమత్తం చేశారు.
- దొరవారిసత్రం మండలంలోని పాలకాలువ, కన్నాకాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. కుప్పారెడ్డిపాళెం సమీపంలోని బ్రిడ్జిపై పాలకాలువ ప్రవహిస్తుడడంతో వెదురుపట్టు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల్లో భారీగా వర్షపు నీరు నిలిచింది. వెదురుపట్టు, తల్లంపాడు, లింగంపాడు, వేటగిరిపాళెం, బురదమడుగు, వేణుంబాకం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన ముంపు, తీర గ్రామాల్లో పర్యటించారు.
- కోట మండలంలో భారీ వర్షం కురుస్తోంది. విద్యానగర్‌లోని ప్రకాశం, ఎన్టీఆర్ కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. పెన్నక్క చెరువుకు నీరు చేరుతోంది. తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, గూడలి దక్షిణపాలం, వంజివాకలో వరినాట్లు నీట మునిగాయి. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయజయరావు తెలిపారు.
- సైదాపురం మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. ఆమె శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో సమీక్షించారు. ప్రతి అధికారీ తాము పనిచేసేచోట్ల ఉండాలని ఆదేశించారు.
- రాపూరు, పెంచలకోనలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- వెంకటగిరి పట్టణంలో శనివారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుండడంతో పలు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి.
- చిల్లకూరు మండలంలో వర్షం కారణంగా పొలాల్లోకి నీరు చేరింది. రోడ్లు దెబ్బతిన్నాయి.
- చిట్టమూరు మండలంలో ఎడతెరిపి లేని వర్షానికి కోట-సూళ్లూరుపేట రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి. ఇటీవల వేసిన వరినాట్లు, నారుమడులు నీటి మునిగాయి.
- గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని పలుచోట్ల కాలనీల్లోకి నీరు నిలిచింది. అధికారులు గ్రామాల్లో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.
- సూళ్లూరుపేట పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. నెర్రికాలువ, కోటపోలూరు ఉన్న పుచ్చాకాలువ, మంగళంపాడు వద్ద ఉన్న దొండకాలువలు వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. కాళంగి నది నిండుగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ నరసింహారావు నదిని పరిశీలించారు. మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గూడూరు రూరల్ : తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వాయుగుండం తీరం దాటే సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలోకి నీరు వస్తే సమీపంలోని పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలోకి వెళ్లాలన్నారు.



నాయుడుపేట టౌన్ : కూచివాడ సమీపంలో నీట మునిగిన పొలాలు



చిట్టమూరు: కోట- సూళ్లూరుపేట రోడ్డుపై నిలిచిన వరద నీరు



సూళ్లూరుపేట రూరల్ : మోకాలు లోతులో నిలిచిన వర్షపు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న పుచ్చాకాలువ



పెరిమిటి పాటు వద్ద జేసీబీతో కల్వర్టును తొలగిస్తున్న తహసీల్దార్

ఇళ్లలోకి వర్షపు నీరు



నీరు చేరిన ఇంటిలోని వారిని పాఠశాలకు తరలిస్తున్న పంచాయతీ అధికారులు

చిట్టమూరు (చిల్లకూరు) : ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. పంచాయతీ కార్యదర్శి జనార్దన్, వెల్ఫేర్ అసిస్టెంట్ కరీముల్లా తదితరులు గ్రామంలో పర్యటించి ఇళ్లలోకి నీరు చేరిన వారిని సమీపంలో ఉన్న పాఠశాలకు తరలించారు.

స్వర్ణముఖి నదిలో పెరుగుతున్న నీటి ప్రవాహం



నాయుడుపేట సమీపంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది



మామిడి కాలువ, స్వర్ణముఖి నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేంద్ర

నాయుడుపేట టౌన్ : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. నాయుడుపేట మున్సిపాలిటీకి సంబంధించిన బోర్లు, తాగునీటి పైపులు కొట్టుకుపోకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. మండల పరిధిలోని మామిడి కాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పండ్లూరు రైల్వే గేటు సమీపంలో ఉక్కు పరిశ్రమల వద్ద రోడ్డుపై నీరు చేరింది. తహసీల్దార్ రాజేంద్ర, సీఐ బాబీ స్వర్ణముఖి నదిని, మామూడి కాలువను పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు.

- నాయుడుపేటలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తుండడంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరింది. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కార్మికులతో కలిసి నీటిని తొలగించే ఏర్పాట్లు చేశారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. గ్రామాల్లో వరినారు మడులు దెబ్బతిన్నాయి.

పొంగిన కాళంగి నది



దొరవారిసత్రం : మావిళ్లపాడు సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నెర్రికాలువ



దొరవారిసత్రం : తనియాలి గ్రామ సమీపంలో బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న కాళంగి నది

దొరవారిసత్రం : మండలంలోని తనియాలి గ్రామ సమీపంలో ఉన్న కాళంగి నది ప్రవాహం శనివారం రాత్రి ఉధృతమైంది. వరద నీరు బ్రిడ్జి మీద అడుగుకు పైగా ప్రవహిస్తోంది. బ్రిడ్జిపై ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రెవెన్యూ అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అదే విధంగా మావిళ్లపాడు గ్రామ సమీపంలో నెర్రికాలువలో కూడా వరద నీటి ప్రవాహం పెరిగింది. జాతీయ రహదారి ఆనుకుని ప్రవహిస్తోంది. రాత్రి పొద్దుపోయే సమయానికి రోడ్డుపైకి చేరుతుందని గ్రామస్తులు తెలిపారు. కాళంగి, నెర్రికాలువ నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ శైలకుమారి, ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

కండలేరులో 53.145 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో శనివారం నాటికి 53.145 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ నుంచి 609 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 4,400 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 210, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కారును ఢీకొన్న తమిళనాడు బస్సు





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బస్సు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి కూడలి సమీపంలో శనివారం కారును తమిళనాడు బస్సు ఢీకొంది. కారులో ఉన్న అయ్యప్ప భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన ఆరుగురు అయ్యప్ప మాలధారులు కారులో శబరిమలై బయలుదేరారు. నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద చెన్నై నుంచి నాయుడుపేటకు వస్తున్న తమిళనాడు బస్సు ఢీకొంది. దీంతో కారులోఉన్న అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు వెనుక భాగం బాగా దెబ్బతింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేసి మరొక వాహనంలో శబరిమలై వెళ్లిపోయారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. వారిని కూడా మరొక బస్సులో గమ్యస్థానాలకు తరలించారు. పోలీసులు తమిళనాడు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులపై దృష్టిసారించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు సమ్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పూజలనంతరం స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.